
ప్రజాశక్తి
శనివారం 20 డిసెంబర్ 2025



24న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 24న కురుపాంలో జరుగు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులకు యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు గోవిందరావు, బొత్స ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈనెల 24న కురుపాంలో యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తుత విద్యారంగ సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. విద్యారంగానికి సంబంధించి పలు తీర్మానాలను ఆమోదిస్తారని, తదుపరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.


చలికి వణుకుతున్న గిరిజన విద్యార్థి

మన్యం గజ..గజ

కనిష్ట స్థాయి @12 డిగ్రీలు నమోదు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

అమ్మో చలి, బాబోయ్ చలి ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి నోటా వినిపిస్తున్న మాట. దీన్ని బట్టి చూస్తే చలి తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్ధమవుతుంది. గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా మన్యంలో ఎముకలు కొరికే చలి గిరిజన ప్రాంతాన్ని వణికిస్తోంది. రోజు రోజుకు రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మన్యం జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలు నమోదు కావడం విశేషం. అరకు, పాడేరు ప్రాంతాలతో సమానంగా పార్వతీపురం మన్యంలో కూడా కనిష్ట స్థాయి ఉష్ణోగ్రతల నమోదుతో చలి తీవ్రత రోజు రోజుకు అధికమవుతుంది. ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాలపై చలి ప్రభావం అధికంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో చుట్టూ ఎత్తయిన కొండలు, జలపాతాలు, అడవులు, దట్టమైన పొగ మంచుతో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావడంతో ఎముకలు కొరికే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం ఐదు గంటల నుంచి మొదలైన మంచు ప్రభావం మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు కురుస్తూనే ఉంటుంది. వేకువజాము నాలుగు గంటల నుంచి ఉదయం 8 గంటలకు దట్టమైన పొగమంచుతో వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి. రహదారి అంతా మంచుతో కప్పబడి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకూ అవి చిన్నవో, పెద్దవో తెలియని పరిస్థితి. దూర ప్రాంతం ప్రయాణించేవారు సూర్యోదయం తర్వాత బయటకు వస్తున్నారు. ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల విద్యార్థులు చలికి వణుకుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గ వంటి లక్షణాలతో బాధపడుతూ కనిపిస్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ఇళ్లకే పరిమితవుతున్నారు. షెట్టర్లు, రగ్గులతో రక్షణ పొందుతున్నారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు చలికి వణుకుతూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. శీతాకాలం ప్రభావం మంచు కారణంగా ప్రజలు జలుబు, దగ్గు తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతూ వైద్యం కోసం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. గిరిజన గ్రామాల్లో యువత చలిని తట్టుకునేందుకు వెచ్చదనం పొందుతున్నారు. అధిక వర్షాల కారణంగా భూమి ఒక్కసారిగా చల్లబడడంతో చలి ప్రభావం తీవ్రంగా ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. డిసెంబరు, జనవరి వరకు చలి ప్రభావం అధికంగా ఉంటుందని అంటున్నారు.


తల్లి బిడ్డ సంరక్షణకు సూచనలు ఇస్తున్న డాక్టర్ సిద్ధార్థ

పుట్టిన పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పుట్టిన బిడ్డకు శీతాకాలంలో ఎక్కువ వేడి శరీరం నుంచి పోతుంది కాబట్టి వెచ్చగా ఉంచడానికి బాగా దళసరిగా ఉన్న దుస్తులతో కప్పాలని, లేకుంటే బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

- ఉదయం, సాయంత్రం వేళల్లో శిశువులను బయటకు తీసుకురాకూడదు.
- శిశువులకు జలుబు, జ్వరం వచ్చినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- పాలు తీసుకునేటప్పుడు అలసిపోవడం, చెమట ఎక్కువగా పట్టడం, బాగా నీలంగా మారిపోవడం, ఆయాసం ఎక్కువ అవ్వడం, ఫిట్స్ రావడం, కదలకుండా కొంత సమయం ఉండి పోవడం, శరీరం చల్లగా అయిపోవడం వంటి లక్షణాల్లో ఉంటే వెంటనే తెలియజేయాలి.
- బిడ్డ వయసుకు తగ్గట్టుగా టీకాలు వేయించుకోవాలి. ఇచ్చిన తేదీని క్రమం తప్పకుండా వేయించాలి. కుదరకపోతే మరుసటి రోజైన వెళ్లాలి.
- పుట్టిన బిడ్డను తప్పనిసరిగా చిన్నపిల్లల డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- 8రోజులు, 1నెల ,3నెలలు,6నెలలు, మొదటి సంవత్సరం పుట్టిన ప్రతి పిల్లాడికి థైరాయిడ్ పరీక్ష తప్పసరిగా మూడు రోజుల తర్వాత చేయించాలి.
- పుట్టినప్పటి నుండి ఏడాది వరకూ విటమిన్ డి డ్రాప్స్ తప్పనిసరిగా వాడాలి.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి
ప్రశ్నించే తత్వమే శాస్త్రవేత్తగా మారుస్తుంది : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికితీసి, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక డివిఎమ్ఎమ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనకు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సొంతంగా తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ వల్లే ఈరోజు ఎమ్మెల్యేగా మీ ముందు నిలబడ్డానని, ఉపాధ్యాయులు చెప్పే మాటలను విద్యార్థులు గౌరవించాలని, వారు మందలించినా అది విద్యార్థుల భవిష్యత్తు కోసమేనని గుర్తుంచుకోవాలన్నారు. దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తీయడానికే ఇటువంటి వేదికలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జిల్లా విద్యార్థులు ఇక్కడితో ఆగిపోకుండా రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటి బహుమతులు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. నియోజకవర్గ పాఠశాలల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని, చదువుతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, అలాగే నిత్యజీవితంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రశ్నించడం అలవాటు చేసుకున్నప్పుడే విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతారన్నారు. సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు కనుగొనే దిశగా ఆలోచించాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజం ఉన్నప్పుడే మేధావులైన విద్యార్థులు తయారవుతారన్నారు. ఖరీదైన టెక్నాలజీని సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చేలా తక్కువ ఖర్చుతో కూడిన ఆవిష్కరణలు రావాలని ఆకాంక్షించారు. సందేహాలను సరైన వ్యక్తులను అడగండి. సమాధానం దొరికే వరకు వదలకండి. అప్పుడే మీలో పరిజ్ఞానం పెరుగుతుంది, సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి" అని విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో డిఇఒ పి.బ్రహ్మాజీ, డిప్యూటీ డిఇఒలు బి.రాజకుమార్, పి.కృష్ణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.


ప్రయోగాల వివరాలను జెసికి వివరిస్తున్న విద్యార్థిని



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో గల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక సుందరయ్య భవనం నుంచి ర్యాలీగా బయలుదేరిన ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.హరనాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ 19ఏళ్లుగా ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. ఉపాది కూలీలకు ఆర్ధిక భరోసా కల్పిస్తూ గ్రామస్థాయిలో సుస్థిర, శాశ్వత వనరులు, గ్రామాల అభివృద్ధికి ఫీల్డ్ అసిస్టెంట్లు తోడ్పడుతున్నారని చెప్పారు. ఈ చట్టం అమలులో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలిపిన ఘనత వారిదేనని చెప్పారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాజకీయ వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాన్ డేస్ విధానం రద్దు చేయాలని కోరారు. మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు, హెడ్ కౌంటింగ్ సర్వర్ లోపాలను సకాలంలో సరిదిద్దాలని కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించకుండా ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన, మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని కోరారు. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

ప్రజాశక్తి - పార్వతీపురం

సత్ప్రవర్తనతో ఖైదీలు శిక్షను పూర్తి చేయాలని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. జైలు పరిస్థితులు, ఆహారం, వైద్య సౌకర్యాలు, ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి మాట్లాడి నాణ్యమైన ఆహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువలు వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. జైలు రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. జైలులోని పలు విభాగాలను ఆమె పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఒక అడ్వకేట్, పారాలీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు అవసరమైన న్యాయసలహాలు అందిస్తారని చెప్పారు. ఖైదీల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తి సబ్ జైల్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఫిర్యాదులు, అభ్యర్థనలు, ఏవైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సబ్ జైలు అధికారులను ఆదేశించారు. అనంతరం భద్రతా చర్యలు, పారిశుధ్యం, జైలులోని ఇతర సౌకర్యాలను, వంటశాలను పరిశీలించారు. ఈ పర్యటనలో పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు, విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్ వి.లక్ష్మీకుమారి, పార్వతీపురం ఆడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్, విజయనగరం జిల్లా లీగల్ సెల్ ఆథారిటీ సెక్రటరీ ఎ.కృష్ణప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, పారా లీగల్ వాలంటీర్ శ్రీనివాసు, బార్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మన్యం పోలీసుశాఖకు ఎబిసిడి అవార్డు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో వివిధ జిల్లా పోలీసులు మూడు మాసాల్లో ఛేధించిన కేసుల దర్యాప్తును పరిశీలించి, వాటిలో ఉత్తమంగా దర్యాప్తు చేసిన కేసులకు ఇచ్చే ఎబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైం డిటెక్షన్) అవార్డుల్లో మన్యం జిల్లా పోలీసులకు రెండో స్థానం లభించింది. ఈ మేరకు డిజిపి డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా ఎస్‌పి ఎస్‌విమాధవ్ రెడ్డి శుక్రవారం అవార్డులను స్వీకరించారు. సాలూరు మండలం చీపురువలస సమీపాన ఓ అవివాహిత హత్యకు సంబంధించిన నిందితుల్ని 48 గంటల్లో పట్టుకొని కేసు ఛేధించడంలో జిల్లా పోలీసులు చక్కని ప్రతిభ కనబర్చారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన అప్పటి ఎఎస్‌పి అంకిత సురానా, సాలూరురూరల్ సిఐ రామకృష్ణ, దర్యాప్తు బృందం, కేసు దర్యాప్తులో ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేసిన, ఎస్పీని డిపిజి అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లా పోలీసు వ్యవస్థను ముందుకు తీసుకుపోవాలని సూచించారు.


డిజిపి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఎస్‌పి మాధవరెడ్డి


రైతు సేవా కేంద్రం వద్ద బైఠాయించిన రైతులు

ఆర్ఎస్‌కె వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - సీతానగరం

తమ వద్ద నుంచి తీసుకున్న ధాన్యం మిల్లుకు పంపకుండా నిలిపివేయడంతో మండలంలోని అంటిపేట రైతు సేవా కేంద్రం వద్ద రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. తమ సమస్యను పరిష్కరించేంత వరకూ ఇక్కడ నుంచి కదిలేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. ఒకానొక దశలో రోడ్డును దిగ్బంధం చేస్తామని రైతులు తెలిపారు. అక్కడే ఉన్న తహశీల్దార్ ప్రసన్న కుమార్, వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ సబ్ కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి మార్గం చూపారు. సబ్ కలెక్టర్ రైతు నాయకులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే నిలిచిపోయిన నాలుగు లారీలను గరుగుబిల్లి రైస్ మిల్లుకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు మాట్లాడుతూ అంటిపేట, వెంకటాపురం, కాసయ్యపేట గ్రామాలకు చెందిన ధాన్యం రైతులు గత నాలుగు రోజులుగా అంటిపేటలో గల రైతుసేవా కేంద్రం వద్ద 4 లారీలను మిల్లులకు పంపకుండా నిలిపివేశారన్నారు. మిల్లర్లను, అధికారులను అడిగితే బీజీలు అయిపోయాయని సమాధానం చెబుతున్నారని, తీరా మిల్లు వరకు చేరితే అదనంగా రైతుల వద్ద 10 కేజీల వరకు దోపిడీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాస్థాయి అధికారులు రైతులు పండించే ధాన్యాన్ని 24 గంటల్లో సరఫరా చేసి రైతుల ఖాతాల్లో సొమ్మును జమ చేస్తున్నామనిచెప్తున్నప్పటికీ ఆచరణలో ఎక్కడా కూడా అమలు కావడంలేదని విమర్శించారు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే స్థానికంగా ఉన్న మిల్లులకే ధాన్యాన్ని పంపిణీ చేయాలని, రైతుల వద్ద నుండి మిల్లర్లు చేస్తున్న (ప్రతి బస్తాకు 10 కేజీల)దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి లక్ష్మనాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతులు సిరికి శ్రీనివాసరావు, పైల విశ్వనాథం, లంక గోపాలం, ఆర్, సత్యనారాయణ,జగన్నాథం తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జీ అమానుషం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నెల్లూరు నగరంలో మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా పోరాటం చేస్తుండగా ప్రోలీసులు లాఠీఛార్జీ చేయడం దుర్మార్గపూరితమైన చర్యని, దీన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తున్నదని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ కార్మికులు ర్యాలీ , నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మంత్రుల సబ్ కమిటీ పేరుతో కాలయాపన చేయడం దారుణమన్నారు. గత జులైలో జరిగిన సమ్మె సందర్భంగా సమ్మె కాలం జీతం చెల్లించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అంగీకరించారని, జూలై 22న మున్సిపల్ మంత్రి అధికారులు తెలిపారు కానీ, నేటికీ సమ్మె కాలం జీతం చెల్లించలేదని తెలిపారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుండా కాలయాపన చేయటం వల్ల గత రెండు రోజులుగా నెల్లూరులో కార్మికులు సమ్మె బాట పట్టడంతో పోలీసులు కార్మికులపై విరుచుకుపడి లాఠీ చార్జి చేసి పలువురిని గాయపర్చడం దుర్మార్గమని వాపోయారు. నిర్బంధాలతో పోరాటాలను, ఉద్యమాలను అణచాలనుకోవడం ప్రభుత్వ అవివేకం తప్ప మరొకటి కాదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు అవసరమైన జీవోలను విడుదల చేయాలని, క్రిస్మస్, నూతన సంవత్సర పండుగలు ఉన్నందున సమ్మె కాలం జీతం చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టి ఆందోళన ఉధృతం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకర్రావు, మామిడి శివ, బంగారి రవి, జి.గంగరాజు, ఎన్.శివ, శీను, గంగయ్యలు, ఇప్పలమ్మ, పాపులమ్మ, సుజాత, మేస్త్రీలు డ్రైవర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : నెల్లూరు జిల్లాలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వం పోలీసులతో లాఠీఛార్జీ చేయించడాన్ని నిరసిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చి, ఇప్పుడు వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని అవుట్ సోర్సింగ్ విధానం కేవలం కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమేనని ఆయన మండిపడ్డారు. నెల్లూరులో మహిళా కార్మికులని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకరరావు, రవి, రాముడు, శ్రీను, పార్వతి, ఈశ్వరరావు, వెంకట్రావు, భోగీసు, వెంకన్న, పోలరాజు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ : నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిగిన పోలీసు లాఠీఛార్జీకి ఖండిస్తూ పాలకొండలో నిరసన మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ పోలీస్ లాఠీఛార్జీలో ప్రతిమ, నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడగా మరో పదిమందికి కూడా గాయాలయ్యాయని అన్నారు. నిర్బంధాలు, పోరాటాలు, ఉద్యమాలను అణచాలనుకోవడం ప్రభుత్వ అవివేకం తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు అవసరమైన జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతల సంజీవి, పడాల వేణు, శ్రీదేవి ,రఘు, వీ ఆంజనేయులు, పి భాస్కర్ రావు, మధు, తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల చర్యలకు నిరసనగా ర్యాలీ, నిరసనలు



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



పాలకొండలో నిరసన ర్యాలీ చేపడుతున్న పారిశుధ్య కార్మికులు



సాలూరులో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌వై నాయుడు

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని పోలియో రహిత సమాజం కోసం తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి హితవు పలికారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, జెసి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను వేయడానికి చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. సమీక్షలో ఐసిడిఎస్, డిఆర్డిఎ, జిల్లా పరిషత్ పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు చేపట్టిన చర్యలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లులో ప్రయాణంలో ఉన్న పిల్లల కోసం ప్రత్యేక మొబైల్ బూత్‌ల ఏర్పాట్లపై ఆరా తీశారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండి ఎక్కడ పిల్లలు మిస్ కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ క్రమంలో రవాణా సౌకర్యాలు, క్షేత్రస్థాయి సిబ్బంది విధులపై ఉన్నతాధికా రులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21న నిర్వహించనున్న పోలియో చుక్కలు కార్యక్రమానికి హాజరు కాని వారికి ఇంటింటికీ సర్వే నిర్వహించి పిల్లలకు 22, 23 తేదీల్లో పల్స్ పోలియో చుక్కలు వేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు అప్రమత్తం కావాలని, గ్రామ, వార్డు స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించాలని అధికారులను ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డిఆర్డిఎ, ఐసిడిఎస్ పిడిలు ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, డిఎంఒ వెంకటేశ్వరరావు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా రవాణా అధికారి వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లాలో పిహెచ్సి, సిహెచ్‌సిల మెడికల్ ఆఫీసర్స్ ఉన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో పెండింగ్ ఉన్న విద్యుత్ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని విద్యుత్‌శాఖ అకౌంటెంట్ ఆఫీసర్ వై.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.రమేష్‌ను కలిసి మండలంలోని గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లుల బకాయి వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీల్లో విద్యుత్ బిల్లులు రూ.18 లక్షల వరకు ఉన్నట్లు తెలిపారు. తక్షణమే వీటిని చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒను కోరారు. అలాగే మండలంలోని ఇతర శాఖల అధికారులకు సంబంధించి బకాయిలు ఉన్న బిల్లులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని 2870 సర్వీసుల పంపుసెట్లకు సంబంధించి రూ.23 లక్షలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. మండలంలోని 3800 గిరిజనులకు సంబంధించిన సర్వే నెంబర్ లు, 2300 ఎస్సీలకు చెందిన సర్వే నెంబర్లు మొత్తం కోటి రూపాయలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఈ పెండింగ్ ఉన్న బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి వసూలు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఇప్పటికైనా స్పందించి బకాయిలు ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లించుకొని ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని కోరారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో విద్యుత్ శాఖ జూనియర్ అకౌంట్ ఆఫీసర్ బికెవి ప్రసాదరావు, విద్యుత్‌శాఖ ఎఇ జి. వెంకటరమణ, విద్యుత్ శాఖ సిబ్బంది అధికారులు ఉన్నారు.


సిఐటియు జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న రెడ్డి వేణు

4న చలో విశాఖను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 4న సిఐటియు జాతీయ మహాసభలను పురస్కరించుకొని చేపట్టనున్న చలో విశాఖను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు కోరారు. శుక్రవారం ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో మహాసభల సందర్భంగా పట్టణంలోని 14 వార్డులో కార్యకర్త బి.సుజాత జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా భోజన కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులను బానిసలుగా చేయనున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండిఎం నాయకులు బి.లక్ష్మి, ఆవాల పద్మ, సుకన్య, కె.పోలమ్మ, కె.సింహాచలం, ఎ.సావిత్రమ్మ, అంగన్వాడీ నాయకులు ఎం.అప్పల నరస, పి.లీలావతి, బి.సుజాత, యు.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

విద్యుత్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను విద్యుత్ శాఖ డిప్యూటీ డిఇ ఎం.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ను అవసరమైన మేరకే వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు శక్తి వనరులను కాపాడగలమన్నారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విద్యుత్ పొదుపు ప్రాధాన్యతను తమ రచనలు, చిత్రాల ద్వారా స్పష్టంగా వ్యక్తపర్చారని, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ వై.కోటేశ్వరరావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న వైసిపి ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గం వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 21న (ఆదివారం) వైసిపి పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పట్టణంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బోను గౌరీశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ సభ్యులు సువ్వాడ లావణ్య, ఎడ్ల త్రినాథ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సరిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా యూత్ సెక్రటరీ ఎస్ చంద్రరావు, సీనియర్ నాయకులు రెడ్డి రవి కుమార్, పాల్గొన్నారు.

గంజాయి, నాటుసారాను అరికట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో గంజాయి, నాటుసారాను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు వి.దాలి నాయుడు, కోలా కిరణ్ కుమార్, కోలా ప్రశాంత్, మాజీ కౌన్సిలర్ బొమ్మాలి మోహన్ రావు, సాలూరు నియోజకవర్గం ఇన్చార్జి గేదెల రామకృష్ణ, మంత్రిపూడి వెంకటరమణ తదితరులు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయ అధికారి జి.రామమూర్తికి శుక్రవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒడిశా ఆంధ్ర సరిహద్దుగా ఉండటంతో జిల్లాలోకి గంజాయి, నాటుసారా విరివిగా దిగుమతి అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో రానున్న పండుగ రోజుల్లో వాటి రవాణా పెరిగే అవకాశం ఉందన్నారు. కావున ఆయా రోజుల్లో వాటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో నాటుసారా, గంజాయి రవాణా, అమ్మకాలు, వినియోగం లేకుండా చేయాలన్నారు. వాటికి పాల్పడే వారికి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.

వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

వికలాంగ విద్యార్థులకు చేయూతను అందించడమే లక్ష్యంగా ఉచిత ఉపకరణాల గుర్తింపు శిబిరం ఏర్పాటు లక్ష్యమని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, జిల్లా సమగ్ర విద్యా కోఆర్డినేటర్ పెంట భానుమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సమగ్రశిక్ష, అలింకో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక శిబిరానికి కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల నుంచి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 59 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సుమారు రూ. 9,19,836 విలువ అంచనా వేశామని, ఎంపిక చేసిన ఉపకరణాలను త్వరలోనే విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్ఎం తోట శంకర్రావు, టీమ్ సభ్యులు ఆర్.శంకరరావు, కె.జగన్, భవిత ఉపాధ్యాయులు ఎం.గౌరీశ్వరి, ఎన్.శ్రీదేవి పాల్గొన్నారు.

మెడిటేషన్ పై అవగాహన

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాస్టర్ క్లాస్ ఇన్ మెడిటేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుశాంత్ జన దీనిపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ నుండి ట్రైనర్ సుధారాణి దీనిపై ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రావు, బోధకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని పోలవరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం నిరాశ్రయులైన బాధితులను కండిక అక్కమ్మ కుటుంబానికి బత్తిలి ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పరామర్శించి బియ్యం, దుప్పట్లు, బట్టలు, కూరగాయలు శుక్రవారం అందజేశారు. కమ్యూనిటీ పోలీసింగ్లో భాగంగా నిత్యావసర సరుకులు అందజేశామని పోలీసులు తెలిపారు.

నడుకూరులో సివిల్ రైట్స్ డే


ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరులో శుక్రవారం సివిల్ రైస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, ఎంపిడిఒ బి.వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో కులాలు విభజించకుండా అంతా సమానత్వం కలిగి జీవించాలని, తగాదాలు పడకూడదని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సత్యనారాయణ, గ్రామ పెద్దలు ఎం వెంకటరమణ ,ఫకీర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతమే లక్ష్యం : దండి

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి బలోపేతమే తమ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు వివరాలను స్థానిక. విలేకర్లకు ఫోన్లో ఆయన వివరించారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజల్లోకి పార్టీ సిద్ధాంతాలను బలంగా తీసుకువెళ్లే అంశాలపై రాష్ట్ర స్థాయి నాయకులతో చర్చించామన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు మరియు పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.


వైసిపినేత సజ్జలను కలిసిన దండి శ్రీనివాసరావు

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయొద్దు

ప్రజాశక్తి - సాలూరు

జాతీయ ఉపాధిహామీ చట్టాలన్ని కేంద్రప్రభుత్వం రద్దు చేయసే యోచనను విరమించుకోవలని, ఎప్పటిలాగే ఈచట్టం అమలు చేసే బాధ్యత కేంద్రంపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదపదం పంచాయతీ బాగువలసలో ఉపాధి హామీ చట్టం మార్పు చేసే పద్ధతిని వ్యతిరేకిస్తూ కూలీలతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక అల్లాడిపోతున్న ప్రజలకు కనీసం తినడానికైనా తిండి ఉండాలనే ఉద్దేశంతో గత పాలకులు ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం పేదల నోట్లో మట్టి కొట్టేలా ఈ చట్టాన్ని రద్దు పరుస్తూ పని దినాలను పెంచుతున్నట్లు ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు భరించాలన్న నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. గతంలో వలె కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకొని 90 శాతం నిధులు కేటాయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకురోజు కూలి రూ.600 ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకోవాలని, లేనిపక్షంలో ఉపాధి కూలీలంతా పోరాటాలకు హెచ్చరించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సుమిత్ర, బుచ్చమ్మ, అల్లు సోమమ్మ, గొర్ల బంగారమ్మ, పుల్లేరు నందయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పాత పద్ధతి ప్రకారం ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేయాలని, కూలీలను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఎంపిడిఒ రమేష్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, 200 రోజులు పని కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక నాయకులు రాము, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



బాగువలసలో నిరసన తెలుపుతున్న కూలీలు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

గరుగుబిల్లి : గ్రామీణ పేద ప్రజలకు ఎంతో ఉపశమనంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని, ఈ ప్రయత్నాలను తక్షణమే ఉపసంహరించు కోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఈనెల 22న స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరణం రవీంద్ర, సిఐటియు నాయకులు పి గోపాల్,బి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కారం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉద్యోగుల, పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేసుత్నుట్టు ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్స్ గ్రీవెన్స్ నిర్వహించి పలువురు ఉద్యోగుల, పెన్షనర్స్ నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఉద్యోగులు విన్నవించిన వివిధ సమస్యలను ఆయన ఆలకించి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్లో 08 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని వాటిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ దుర్గా ప్రసాద్, పిఎఒ శంకర రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన పిజిఆర్ఎస్కు ఆరు వినతులు వచ్చాయి. ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ ఫిర్యాదులను స్వీకరించారు. సమావేశంలో డిప్యూటీ డిఇఒ రామ్మోహన్రావు, డిడి అన్నదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న పంచాయతీ అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, గ్రామ సర్వే సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

గ్రీన్ అలంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలంటూ గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం మామిడిపల్లిలో యూనియన్ నాయకులు పి మన్మధరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కువ పంచాయతీల్లో ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, పంచాయతీల్లో నిధుల్లేవనే కారణంతో జీతాలు వెనక్కు నెట్టేస్తే పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రభుత్వ లక్ష్యం ఏ విధంగా నెరవేరుతుందని, కార్మిక వర్గాన్ని పస్తులతో ఉంచి పని ఎలా చేయిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పండగలను దృష్టిలో పెట్టుకుని వెంటనే కార్మికులకు బకాయి జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై ఈనెల 22న మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అధికారులకు విన్నవిస్తామన్నారు. అలాగే ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే బహిరంగ సభలో పంచాయతీ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మత్స తమ్మయ్య, కోనేటి రాయప్ప, మత్స రాజారావు, కోన శ్రీను, బాకా ఎరుకలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిపి

ప్రజాశక్తి - కొమరాడ

పీసా చట్టాలపై ప్రభుత్వం ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని అధికారులు, సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టాలపై మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు ఎంపిడిఒ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలను పూర్తిస్థాయిలో గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టాలపై అవగాహన కల్పిస్తూ గిరిజనులు చైతన్యపర్చేందుకు ప్రభుత్వ ఈ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఎంపిడిఒ రమేష్ మాట్లాడుతూ మండలంలోని పీసా గ్రామపంచాయతీ పరిధిలో గల వార్డు మెంబర్లకు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 20న శిక్షణా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఈనెల 22న పీసా పంచాయతీలకు సంబంధించి ఉప సర్పంచ్లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చి చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సిబ్బంది విధిగా హాజరై చట్టాలపై అవగాహన కల్పించుకొని ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి సభ్యులు ద్వారపు రెడ్డి లక్ష్మి, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఎంపిపి, జడ్పిటిసి, సర్పంచులకు శుక్రవారం పీసా పై అవగాహన నిర్వహించారు. ఎంపిపి ఆదినారాయణ మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో పీసా మహోత్సవాలు సందర్భంగా ఈ చట్టంపె అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామసభలు నిర్వహించి గ్రామానికి సంబంధించిన సమస్యలపై తీర్మానం చేసుకోవాలని చెప్పారు. ఈ శిక్షణ ఆలస్యంగా జరిగినందుకు సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి లక్ష్మి, ఎంపిడిఒ మిశ్రా, డిప్యూటీ ఎంపిడిఒ మోహన్ బాబు, శ్రీనివాసరావు, సర్పంచులు ఆదిలక్ష్మి, నిమ్మక తిరుపతిరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 0 నుండి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలను వేయనున్నట్లు తెలిపారు. 230 కేంద్రాల్లో సుమారు 22,000 మంది పిల్లలకు పల్స్ పోలియో టీకాలను వేస్తామని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పీవో కోరారు.

మల్లి గ్రామంలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ

ఈనెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా చాందిని ఆధ్వర్యంలో మల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ ప్రచార నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ, ప్రజలకు పోలియో చుక్కల ప్రాముఖ్యతను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బత్తిలి పిహెచ్సి వైద్య సిబ్బంది పోలియో చుక్కలు ఆవశ్యకతను తెలియజేస్తూ బత్తిలిలో ర్యాలీ నిర్వహించి, పల్స్ పోలియోపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 0–5 పిల్లలుకి జీవితాంతం రక్షణకి 2 చుక్కలు పోలియో చుక్కలు తప్పనిసరి డి పిఎంఒ డాక్టర్ రఘు కుమార్ అన్నారు. కార్యక్రమంలో వైద్యులు కొండపల్లి రవీంద్ర, కొండ్రు దామోదరరావు ఉన్నారు.



బత్తిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొటియాకు తల్లిలాంటిది ఒడిశా

ఆంధ్రా అత్త మాటలు నమ్మొద్దు

ఒడిశా రెవెన్యూ మంత్రి వ్యాఖ్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

వివాదాస్పద కొటియా గ్రామాలకు ఒడిశా తల్లిలాంటిదని, ఆంధ్రా అత్త మాటలు నమ్మొద్దని ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారి అన్నారు. శుక్రవారం ఒడిశా రెవెన్యూ, విపత్తు నిర్వహణ మంత్రి సురేష్ పూజారి ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మధ్య వివాదంలో ఉన్న కొటియాను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒడిశా కొటియాకి తల్లిలాంటిదని, ఆంధ్రా అత్త ఎప్పటికీ తల్లి కాలేదని అన్నారు. తన టాక్స్ కమాండ్లోని ఆరుగురికి రూ.3500 కొత్త భత్యం, 5 మంది రైతులకు బఠానీ విత్తనాలు, రూ. 216,000 విలువైన బ్రాయిలర్ ఫామ్ , 31 మహిళా స్వయం సహాయక సంఘాలకు కోటి రుణాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టంగి, కొరాపుట్, కోటిపాడ్ ఎమ్మెల్యేలు రామ్ చంద్రకదమ్, రఘురామ్ మాచ్, రూపు భత్రా, కోరాపుట్ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, భద్రతా అధికారి రోహిత్ వర్మ పాల్గొన్నారు.

కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పించి జిసిసి ద్వారా కిలో రూ.800కు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సతాబి సర్పంచ్ శిల్పజన్ని రామయ్య, ఎంపిటిసి ప్రతినిధి చదల రాజు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు శుక్రవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని సతాబి, తంగలం ప్రాంతాలో వీరు పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటిళ్లపాదీ ఎంతో కష్టపడి గింజలను ఏరి అవి పిక్కలుగా మార్చడానికి ఎంతో శ్రమ పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అలా తయారు చేసిన కాఫీ గింజలను గుమ్మకోట ప్రాంతాలకు వెళ్లి కిలో రూ.300కు ప్రైవేటు వ్యాపారులకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇది ఎంత మాత్రం గిట్టుబాటు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రోత్సాహం, మార్కెట్ సౌకర్యం కల్పిస్తే గిరిజనులకు మంచి ఉపాధి దొరుకుతోందన్నారు. పాడేరు ఆ ప్రాంతాల్లో ఆ ప్రోత్సాహకాలు జరుగుతుండ వల్ల గిరిజనులు కాఫీ పంటల పట్ల ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని ఈ ప్రాంతాన్ని కూడా అదే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. కాఫీ తో పాటు మిరియాలు కూడా పండే అవకాశాలున్నాయని కలెక్టర్, ఐటిడిఎ పిఒ తమ గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సేవి లచ్చయ్య, శిల్పజన్ని శ్రీరామ్, అప్పలస్వామి పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని దుగ్గేరులో ప్రతిపాదించిన చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ 2వేల మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం తుండ పంచాయతీ ఒడ్డువలసలో సర్పంచ్ నూకరాజు ఆధ్వర్యంలో 'దుగ్గేరు పంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ' ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ కన్వీనర్ రాయల సుందర్రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ తరతరాలుగా అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసీలను ఈ ప్రాజెక్టు సాకుతో నిర్వాసితులను చేయడం అన్యాయమన్నారు. అక్టోబర్ 14న ప్రభుత్వం విడుదల చేసిన జీవో 84 ద్వారా కార్పొరేట్ సంస్థలకు గిరిజన భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల పనసభద్ర, కొదమ పంచాయతీల్లోని అనేక గిరిజన గ్రామాలు నామరూపాలు లేకుండా పోతాయని, వేలాది ఎకరాల పచ్చని అడవులు, సాగు భూములు కనుమరుగవుతాయని అన్నారు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మైదాన ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు మొదలవుతాయని తెలిపారు. ప్రకృతిని విధ్వంసం చేసే హైడ్రో పవర్ ప్లాంట్లకు బదులుగా, పర్యావరణానికి మేలు చేసే పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న 'సురాపాడు మినీ రిజర్వాయర్'ను పూర్తి చేస్తే గిరిజనులకు, రైతులకు మేలు జరుగుతుందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ కో–కన్వీనర్లు ఊయక ముత్యాలు, మరి చెంచు, గిరిజన నాయకులు అన్నారావు, గ్రామ పెద్ద చోడిపల్లి లక్ష్మణరావు గిరిజనులు పాల్గొనారు.



సభలో మాట్లాడుతున్న పోరాట కమిటీ కన్వీనర్ సుందరరావు

'సబ్ రిజిస్ట్రార్ నిర్ణయం సరైనదే'

సాలూరు: పట్టణంలో కోట్ల విలువైన దేవాదాయ భూముల రిజిస్ట్రేషన్ చేయాలని సబ్ రిజిస్ట్రార్పై ఒత్తిడి చేయడం సరికాదని సామాజిక కార్యకర్త హరిరెడ్డి చెప్పారు.శుక్రవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ కోర్టు వివాదాల్లో వున్న దేవాదాయ భూముల రిజిస్ట్రేషన్ చేయాలని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు సబ్ రిజిస్ట్రార్ ని బెదిరించేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు.గతంలో జమిందార్ కుటుంబ వారసుడినని చెప్పుకునే వ్యక్తి దేవాదాయ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారని, దీనిపై పలు కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని చెప్పారు. వెంకటేశ్వరా డీలక్స్ థియేటర్, దాని పక్కనున్న స్థలాలు దేవాదాయ భూములని గతంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అధికారి, పార్వతీపురం జిల్లా దేవాదాయ అధికారి ప్రకటించారని గుర్తు చేశారు.ఆ భూముల రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్ కి వారు లేఖలు రాశారని సామాజిక కార్యకర్త నైన హరిరెడ్డి తెలిపారు.

హమాలీలకు ఒకే రకమైన రేటు ఇవ్వాలి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఎఫ్సిఐ సివిల్ సప్లై గోదాంలో పనిచేస్తున్న హమాలీలకు ఒకే రకమైన రేట్లు యజమానులు చెల్లించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని సూరంపేట ఎఫ్సిఐ సివిల్ సప్లై గోడౌన్లో శుక్రవారం కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎఫ్ఐసిడబ్ల్యూసి నిబంధనల ప్రకారం ప్రైవేట్ గోదాం యజమానులకు రేటు చెల్లిస్తుందని దీని ప్రకారమే కార్మికులకు చెల్లించాలన్నారు. హమాలీల కూలి రెట్టింపు పెంపునకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు పిఎఫ్, ఇఎస్ఐ అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిలభారత భారత మహాసభలకు జయప్రదం చేయాలని, 4న జరిగే కార్మిక ర్యాలీకు కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.ధనుంజయ్, నాయకులు సిరికి అప్పలనాయుడు, పి.శ్రీనివాసరావు గొట్టాపు సింహాచలం ఏ సింహాచలం కార్మికులు పాల్గొన్నారు

మానసిక ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - పాచిపెంట

"జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం అమల తీరును పరిశీలనకు కేంద్రం నుంచి పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీమ్ సభ్యులు డాక్టర్ రమణ యడ్ల, డాక్టర్ చీపురుపల్లి పాదాలు జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావుతో కలిసి శుక్రవారం పాచిపెంటలోని పర్యటించారు. ఈ సందర్భంగా పిహెచ్సి, అంగన్వాడీ కేంద్రంతో పాటు కూర్మరాజుపేట హెల్త్ వెల్నెస్ కేంద్రాలను సందర్శించారు. ముందుగా వైద్యులు, సిబ్బందితో సమీక్షించి మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, అందుతున్న మానసిక వైద్య సేవలు సిబ్బంది పనితీరును గురించి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. "డిస్టిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా అందుతున్న మానసిక వైద్య సేవలు గురించి వివిధ అంశాలపై సమీక్షించారు. పాఠశాలల్లో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. కేంద్రంలో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఆరోగ్య సూత్రాలకు సంబంధించి గోడ పత్రికలు, ఐఇసి పరిశీలించారు. మందుల లభ్యతపై తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో సేవలపై పరిశీలించారు. కూర్మరాజుపేటలో గ్రామస్తులతో ముఖాముఖీ మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. మెంటల్ హెల్త్ డిజార్డర్ తో ఉన్న వారి ఇళ్లకు వెళ్లిచికిత్సా వివరాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రవిచంద్ర,. సిడిపిఒ బి.అనంతలక్ష్మి. సిహెచ్ఒ టి.జమ్మి, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ కృష్ణారావు, హెల్త్ వెల్నెస్ కేంద్రం వైద్య సిబ్బంది పూజా పట్నాయక్, పి.దేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో ఫ్రైడే.. డ్రై డే

ప్రజాశక్తి - మక్కువ

ఫ్రై డే – డ్రై డే కార్యక్రమం మక్కువలో ఎంపిడిఒ ఎన్.అర్జునరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై చెత్త వేయరాదని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త కు వేరువేరుగా డస్ట్ బిన్నులు ఉపయోగించాలని, ప్లాస్టిక్ వాడరాదనీ నియంత్రించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, విలాస్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో సర్పంచి ఆవాల సింహాచలమమ్మ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రతతో వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ జి.పైడితల్లి సూచించారు. పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశు ధ్యం మెరుగుపరచడం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పెంపొందించాలని హార్టికల్చర్ అధికారి పి జయశ్రీ అన్నారు. మండల మహిళా సమైక్యలో ప్రకృతి వ్యవసాయ సమన్వయ సమావేశం వెలుగు ప్రాజెక్ట్తో నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డిపిఎం ప్రవీణ్ కుమార్ ఎన్ఎంఎన్ఎఫ్ ముఖ్యోద్దేశం వివరించారు. గ్రామైక్య సంఘాలతో ప్రకృతి వ్యవసాయాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశాలపై మాట్లాడారు. ఉత్పత్తులు, మార్కెటింగ్ జరుగుతున్నాయని, అదేవిధంగా మండలంలో నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్లో ఆరు గ్రామాలు ఎంపికయ్యావని తెలిపారు. ఆ గ్రామాల్లో గ్రామ సభలు, ర్యాలీలు కెవిపి ఏ విధంగా చేయాలనే విషయాలపై ప్రకృతి వ్యవసాయ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వాహిణి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని చెరుకుపల్లి సమీపాన జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం క్రిస్మస్ సందర్భంగా కొమ్మలపాడు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆటోలో సామాన్లు కొనుగోలు చేసేందుకు సాలూరు పట్టణానికి వెళ్లారు. కొనుగోలు అనంతరం ఒడిశాలోని తమ స్వగ్రామం కమ్మలపాడుకు గురువారం రాత్రి ఆటోలో తిరిగి ప్రయాణమయ్యారు. పాచిపెంట మండలం చెరుకుపల్లి జంక్షన్ వద్దకు వచ్చేసరికి అక్కడ రోడ్డు పక్కన ఆగి ఉన్న బొలేరో వ్యాన్కు ఆటో పై ఉన్న పరుపు తగులుకోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కోరాపుట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వీరిలో కొమ్మాల సింధూరి (55) మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-బలిజిపేట

బలిజిపేట మండలంలో బర్లి గ్రామం వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బొబ్బిలి నుంచి పలగర గ్రామానికి వెళ్తున్న ముగ్గురు యువకులను బలిజిపేట నుంచి కాకినాడకు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈఘటనలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ను మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. మిగతా వారు బొబ్బిలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.